# మూగమనసు

◆ డి.శ్రీధరాచార్య ◆

మొదటి రాత్రి

గదిలో అడుగు పెడుతూంటే హెచ్చే గుండెవేగం. తెలియరాని అనుభూతికై కోరికలతో వింతపరుగులు. ఆందోళన. తడబడే అడుగులు. లయ తప్పేగమనం. అదో తరహా...



అలంకరించిన రమ్యను — ఆడంగులంతా కల్సి గది వరకు తెచ్చి లోనకు నెట్టి... దడేలన తలుపులు లాగి బయట నుండి కొక్కెం తగిలించడం... కిల...కిల... నవ్వులు దూరం అవడం అన్నీ జరిగిపోయాయి.

రమ్య తలుపు నానుకొని నిలబడింది కొన్ని క్షణాలు.

శరీరంపైని అలంకారాలన్నీ బరువు అనిపిస్తున్నాయి. కళ్ళెత్తి గదిని కలియచూసింది... లైటు కాంతిలో అలంకరణ మెరిసిపోయింది... రకరకాల పూలు—అగరొత్తుల వాసనలు వ్యాపించిపోయాయి గదంతా.

కదలకుండ తలుపు దగ్గర నిలబడిపోయిన రమ్యను చూసి రమణ బెడ్ దిగి ఆమెను సమీపించాడు. భుజంపై చేయివేసి...ఆమెను మెల్లిగా మంచం వరకు నడిపించుకు వచ్చాడు.

రమ్యనుమంచంపై కూర్చోబెట్టాడు... దిండు క్రింద నుండి ఓ కాగితం తీసి ఆమె చేతిలో పెట్టి... ఆమె ముఖంలోకి చూడసాగాడు.

రమ్య కాగితం మడతలు విప్పింది... తెల్లగా వుంది... స్వచ్ఛంగా వుంది. రెండవ వైపు త్రిప్పింది కాగితాన్ని.

'డియర్ రమ్యా!

మన మధ్య మూడుముళ్ళ బంధం పడిపోయింది. కాని... అనురాగ బంధం ముడి... యిప్పుడు పడబోతోంది... గతంలో సంబంధం లేదు... వేరుగా వున్న శరీరాలు ఒక్కటి కాబోతున్నాయి...

ఇకపై నేను వేరు, నువ్వు వేరుకాదు—

మన కోరికలు... అభిప్రాయాలు ఒక్కటి కావాలి.

ఈ జీవితం చివరి వరకు కల్సి వుండేది...

కాగితం లాంటి స్వచ్ఛమైన మనస్సులో...అందమైన జీవితం ప్రారంభిద్దాం...

— నీ రమణ.

రమ్య చదువుకుంది... భర్తను సమీపించి... మూగవాడైన' అతని గుండెపై వాలిపోయింది.

అపరిష్వంగంలో రమణకు తాను ఆశించిన జవాబు లభించింది... లైట్ ఆరిపోయింది... గదిలో కాలం స్థంభించి పోయినట్లైంది.